క్లుప్తంగా

చిట్యాలలో వైద్యశిబిరం



గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

చిట్యాల : పట్టణంలోని కేర్ స్పెషాలిటి ఆస్పత్రి (అడ్వాన్స్ వూండ్ హీలింగ్ క్లీనిక్) ఆధ్వర్యంలో బుధవారం డయాబెటిక్ రోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.గ్రేస్ పర్యవేక్ష ణలోని వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అల్సర్, కాళ్ల పుండ్లు, దయాబెటిక్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ కేవీఎస్ ఎస్.సంతోషమూర్తి, డాక్టర్ హృషికేష్ కోరాడ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా లక్ష్మీనర్సయ్య



ఎమ్మెల్యే వీరేశం నుంచి నియామక పత్రం అందుకుంటున్న లక్ష్మీనర్సయ్య

నకిరేకల్ : పట్టణానికి చెందిన చిలుకూరి లక్ష్మీనర్సయ్య చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం ఆయనకు ఎమ్మెల్యే వీరేశం ఉత్తర్వుల ప్రతిని అందజేశారు. అనంతరం స్థానిక సంఘం కార్యాలయంలో ఆ శాఖ అధికారి గోపాల్ నుంచి లక్ష్మీనర్సయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు.

పడమటితాళ్లలో తాగునీటి సమస్య పరిష్కారం




తాగునీటి కోసం వేసిన బోరును ప్రారంభిస్తున్న అధికారులు, గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

చండూరు : మండలంలోని పడమటి తాళ్ల గ్రామంలో నెలలుగా తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై బుధవారం సాక్షిలో తాగునీటి తండ్లాట అనే కథనం ప్రచురితమైంది. అందుకు ఆర్డీఓ శ్రీదేవి స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రయ్యతో మాట్లాడి గ్రామంలో బోరు వేయించారు. నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన అధికారులకు, గ్రామపెద్దలకు, సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నిఖిలకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నిఖిల

నల్లగొండ టూటౌన్ : పట్టణానికి చెందిన నిఖిల ఓయూ కామర్స్ విభాగంలో బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఆమె వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో పార్ట్ టైం అధ్యాపకురాలిగా అసోసియేట్ ప్రొఫెసర్ కామర్స్ హెడ్‌గా విధులు నిర్వహిస్తుంది. పంటలు, పశువుల బీమాకు సంబంధించి బీమా కంపెనీల మార్కెటింగ్ పద్ధతులపై రైతుల దృక్పథం అంశంపై నజియా సుల్తానా ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చండూరు : మండల కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

మర్రిగూడ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిఎద్దడిని నివారించాలని తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నీటిఎద్దడి నివారణ చర్యలపై పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

అందని సాగునీరు.. అయోమయంలో రైతులు



కనిష్ట నీటిమట్టంతో ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం కనిష్టానికి పడిపోవడంతో ఆయకట్టుకు సాగునీరందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఆయకట్టు రైతులు అయోమయంలో పడిపోతున్నారు. పంట సాగుకోసం అప్పులు తెచ్చి వేల రూపాయలు ఖర్చు చేసిన రైతులకు ఆ పంటలు ఎండిపోతుంటే తట్టుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం దృష్ట్యా యాసంగి పంట మాత్రం చేతికందడం అత్యంత క్లిష్టపరిస్థితే కనిపిస్తుంది. ప్రస్తుతం ఆయకట్టులో వరి పంటలు చిరుపొట్ట దశలలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పంటలు ఎండుతుండడం ఒకపక్క అయితే ఎండల తీవ్రత కూడా పెరుగుతుండడంతో రైతులను మరింత కలవరపెడుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21అడుగులు కాగా ప్రస్తుతం 5అడుగుల కనిష్టానికి పడిపోయింది. ప్రాజెక్టు కింద ప్రస్తుతం సుమారు 3500 ఎకరాలకు పైగా వరిపంటలను సాగు చేశారు. దీంతో ఆయకట్టు చివరకు సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. రానున్న మరికొద్ది రోజుల్లో ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరనుండడంతో ఆయకట్టు రైతులు పంటలు చేతికి అందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులోకి మూసీనది ఎగువ భాగం నుంచి నీటిని మళ్లించి ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోకుండా కాపాడాలని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులను రైతులు కోరుతున్నారు.



శాలిగౌరారం ప్రాజెక్టులో నీరులేకపోవడంతో ఎడమ కాల్వ తూమును మూసిన అధికారులు



నీటి ప్రవాహం లేక ఎండిపోయిన శాలిగౌరారం ప్రాజెక్టు ఎడమ కాల్వ

దైవభక్తితో మానసిక ప్రశాంతత కలుగుతుంది

- ఎమ్మెల్యే మందుల సామేల్



ఆలయంలో పూజల అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : దైవభక్తితో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని వల్లాలలో గల శ్రీపార్వతీశంభులింగేశ్వరస్వామి దేవాలయ నవరాత్రోత్సవాల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దేవాలయ అర్చకులు, స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీపార్వతీశంభులింగేశ్వర దేవాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి పరిచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కలిగించేందుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. చరిత్ర సంపదగా ఉన్న ఈ దేవాలయాన్ని పరిరక్షించుకోవలిసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ఎండ్లబండ్ల ఆంజనేయస్వామి ప్రభల ర్యాలీలో పాల్గొన్నారు. మొదటగా మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి సమాచారం లేకుండా పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్వహణలపై అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు షేక్ ఇంతియాజ్, శంకర్, రాయలింగయ్య, వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకుడు రామలింగయ్యశర్మ, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అంతటి పారిజాత నర్సింహాగౌడ్ తన జన్మదినం సందర్భంగా బుధవారం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. అనంతరం ఈ పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో పాఠశాల హెచ్‌ఎం యానాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుర్కంటి సత్తిరెడ్డి, అర్రూరీ నర్సింహ, గోలి గణేష్, కాటం సత్తయ్య, దేశబోయిన మల్లేష్, గోలి మహేష్, చింతకింది వెంకటేష్, వడ్డెపల్లి శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరుబాట

నల్లగొండ టౌన్ : పట్టణంలోని 3వవార్డు శేషమ్మగూడెం వార్డు కార్యాలయానికి వెళ్లేందుకు ఎస్టీ కాలనీ నుంచి లింక్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాటలో భాగంగా బుధవారం ఎస్టీకాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు అద్దంకి నరసింహ, 3వ వార్డు పార్టీ శాఖ కార్యదర్శి రుద్రాక్ష రామచంద్రయ్య, శాఖ సభ్యులు నకిరేకంటి జానయ్య, రాములు, శ్రీను, కనకయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని, కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టి చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం చెల్లించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదం జరిగి 11రోజులు గడుస్తున్నా గల్లంతైన కార్మికుల ఆచూకీ తెలియకపోవడం విచారణకరమన్నారు. కనీస భద్రత పాటించకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు, ఉపాధ్యక్షుడు అద్దంకి నరసింహ, పోలె సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఎస్.సైదాచారి, అవుట రవీందర్, కత్తుల శంకర్, బి.వెంకన్న, వెంకట్రావ్, కాశమ్మ, వెంకటయ్య, లింగస్వామి, నర్సింహాచారి, గిరి తదితరులు పాల్గొన్నారు.

రూ.18వేల వేతనం ఇవ్వాలని మంత్రికి వినతి

కనగల్ : ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం మండల కన్వీనర్ కానుగు లింగస్వామి మాట్లాడారు. ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందని, చెప్పిన ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూడాలని మంత్రికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆశావర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నకరేకంటి సైదమ్మ, కట్ట స్వర్ణ, జీవనజ్యోతి, హైమావతి, స్వప్న తదితరులు ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినతి..

కనగల్ : సమగ్ర శిక్షాలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేస్తూ, ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరందాసు సంతోష్‌కుమార్, రాష్ట్ర నాయకులు పగిడిపాటి ప్రవీణ్, వడ్త్యా రాధ, కేజీబీవీ ఎస్ఓ స్వప్న, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న పీఆర్‌టీయూ సభ్యులు

తిప్పర్తి : నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడంతో బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణా సంచాకాల్చి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు నామిరెడ్డి మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహనాయక్, హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు రవి, గోపాల్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శౌకత్‌అలి, హరివర్ధన్‌రెడ్డి, తిరుమలరెడ్డి, అరుణ, కల్పన, జ్యోతి, రజిత, సునిత పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



కేతేపల్లి : ఇనుపాములలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



చిట్యాల : ఆరెగూడెంలోని యూపీఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కట్టంగూర్ : మార్తవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో..

చిట్యాల : మండలంలోని చిట్యాల, నేరడ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఆరెగూడెంలోని యూపీఎస్‌లోని బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. అనంతరం చిట్యాల ప్రాథమిక పాఠశాలలో ప్రతిభ కబర్చిన విద్యార్థులకు ఎంఈఓ పానుగోతు సైదానాయక్, హెచ్‌ఎం అంబటి సత్తయ్య బహుమతులు అందజేశారు. నేరడ, ఆరెగూడెం పాఠశాలలో హెచ్‌ఎంలు నాగరాజు, రేవతి అందజేశారు. కార్యక్రమాలలో ఉపాధ్యాయులు బాధం భిక్షపతి, సరిత, సుధాకర్‌రెడ్డి, సత్యపాల్, సుధాకర్‌రెడ్డి, అరుణ, హేమలత, రామలింగయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని ఇనుపాముల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ముశం వెంకటేశ్వర్లు, కె.వెంకట్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, జి.శ్రీనివాస్, ఎస్.దీప్తి, అతిజ్ అహ్మద్, సీఆర్పీ కె.మహేందర్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల జీపీ పరిధి మార్తవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం సఫియా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమన, శోభ ఉన్నారు.

నకిరేకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే వేముల వీరేశం



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మున్సిపాలిటీకి దశలవారీగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధిలో పెద్దపీట వేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం పట్టణంలోని 5,8,9వార్డుల్లో రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కొంతకాలంగా సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న వార్డుల్లో మొదటి విడతగా రూ.60లక్షలతో సీసీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో రూ.1.50కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అన్ని వార్డులో పూర్తి స్థాయిలో సీసీ, డ్రెయినేజీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అందరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ పైళ్ల శశిధర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, వంటెపాక సోమలక్ష్మి, గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, గర్షకోటి సైదులు, పోతుల సునీత రవీందర్, రాచకొండ సునీల్, చౌగోని అఖిల, యాసారపు లక్ష్మీవెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



కూలీలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

మునుగోడు : ఉపాధిహామీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ జానిమియా ఆరోపించారు. బుధవారం మండలంలోని పులిపలుపులలో ఉపాధిహామీ కూలీలకు పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక కూలీకి ఆత్మీయ భరోసా అందించాలని డిమాండ్ చేశారు. కూలీల హక్కుల సాధన కోసం త్వరలో వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళనలు చేపడుతుందని, అందులో ప్రతి ఒక కూలీ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొల్లూరి ఎల్లయ్య, కొంపల్లి రాములు, పందుల యాదయ్య, సింగం యాదయ్య, లింగయ్య, లక్ష్మి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపార్వతీశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు



శ్రీపార్వతీశంభులింగేశ్వర దేవాలయం ముందు నాయకులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతీశంభులింగేశ్వరస్వామి దేవాలయ నవరాత్రోత్సవాల సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, సూర్యాపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేశ్, మండల అధ్యక్షుడు తోట వినోద్, మండల నాయకులు గుండాల సైదులు, మాదగోని కృష్ణ, కొండేటి వేణుగోపాల్‌రెడ్డి, చాడ శ్యాంసుందర్‌రెడ్డి, పరమేశ్ ఉన్నారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు



నల్లగొండ : కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆదర్శ పాఠశాలలో 238మందికి గాను 215మంది హాజరైనట్లు, కేజీబీవీ పాఠశాలలో 110మందికిగాను 107మంది హాజరైనట్లు ఆయా సెంటర్ల సీఎస్‌లు శివస్వరూపరాణి, సీఎస్‌డీఓలు తెలిపారు. పరీక్షల కేంద్రాలను తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చినమునయ్య పరిశీలించారు.

నార్కట్‌పల్లి : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240మందికి గాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు కాగా చిన్న నారాయణపురంలోని ఎస్సీ బాలికల కళాశాలలో 232మంది గాను 15మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎండీ ఇస్మాయిల్, శమంతకమణి తెలిపారు.



నల్లగొండ : పరీక్షకు హాజరయ్యేందుకు మెట్లు ఎక్కుతున్న విద్యార్థిని



పరీక్షకు హాజరయ్యేందుకు వస్తున్న దివ్యాంగ విద్యార్థి

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాంపల్లి : గత ప్రభుత్వం సేకరించిన భూమిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గట్లమల్లేపల్లి గ్రామంలో ఇళ్ల స్థలాలకు ఎంపిక చేసిన లబ్ధిదారులతో నిరసన తెలిపి మాట్లాడారు. పేదలకు ఇళ్ల పట్టాల ఇవ్వాలని కోరుతూ ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొమ్ము లక్ష్మయ్య, గడ్డం గురుమూర్తి, జడ వెంకటయ్య, ఇరిగి శ్రీను, కురుపాటి శ్రీను, కోటేష్, శంకర్, పర్వతాలు, సైదులు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి మూడుచక్రాల వాహనం అందజేత



మూడుచక్రాల బైక్‌ను అందజేస్తున్న స్నేహితులు

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన దివ్యాంగుడు కంచుగట్ల సైదులుకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు రూ.80 వేలు విలువ చేసే మూడు చక్రాల వాహనాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గోదల వెంకట్‌రెడ్డి, కట్టగూరి శ్రీనివాసులు, జాల శంభయ్య, కొల్లు సత్తిరెడ్డి, గోనె యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కేతేపల్లి : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి లూర్దుమారయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, వెంకన్న,సాదయ్య, సాయమ్మ పాల్గొన్నారు.